సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



69 తులాల బంగారం చోరీ

కె.మత్స్యలేశంలో భారీ చోరీ జరిగింది. 69 తులాల బంగారం చోరీ చేశారు.

- 8లో



హార్డ్‌వేర్ షాపు దగ్ధం

కొత్తూరు బత్తిలి రోడ్డులో అగ్ని ప్రమాదం సంభవించింది. రూ.కోటి వరకు ఆస్తినష్టం జరిగింది.

- 8లో

జీఎస్టీ రేట్లపై కరపత్రం ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జీఎస్టీ 2.0 ద్వారా తగ్గించిన జీఎస్టీ రేట్లకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన కరపత్రాన్ని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆవిష్కరించారు. కరపత్రాలను అక్టోబర్ 19వ తేదీ జరిగే సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ చేరేలా చూడాలన్నారు.

న్యూస్‌రీల్

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

నందిగాం: ఒడిశా నుంచి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న పశువులను సోమవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా నుంచి వ్యాన్‌లో 10 గేదెలు, 2 దున్నపోతులను తరలిస్తుండగా స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై పట్టుకున్నారు. పశువులను తరలిస్తున్న రంజిత్‌పై కేసు నమోదు చేసి, పశువులను విజయనగరం జిల్లా గుర్ల గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం రూ.2.13 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు, అర్చకులు

జలుమూరు: గడిచిన మూడు నెలలకుగాను శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం రూ.2,13,803 వచ్చిందని ఆలయ ఈఓ టీ.వాసుదేవరావు సోమవారం తెలిపారు. ఆలయ అర్చకులు, అధికారులు, భక్తుల సమక్షంలో హుండీ ఆదాయం లెక్కించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మరో మూడు రోజులు వాన

శ్రీకాకుళం పాతబస్టాండ్: గల్ఫ్ ఆఫ్ కాంబే పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఏర్పడిన ద్రోణి వల్ల మరో మూడు రోజుల పాటు జిల్లాలో వర్షాలు, ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ సోమవారం తెలిపింది. ఈ ద్రోణి ప్రభావం ఉత్తర కోస్తాపై ఎక్కువగా ఉంటుందని తెలిపారు. దీని ఫలితంగా రానున్న మూడు రోజులు తేలికపాటి నుంచి ఉరుములతో కూడిన జల్లులు కురుస్తాయని పేర్కొన్నారు. ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడతాయని, ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు.

మద్యం కేసు.. అంతేనా బాసూ!

- నకిలీ మద్యం కేసు నీరు గారినట్టేనా..?
- తప్పించుకుని తిరుగుతున్న కీలక సూత్రధారి మీసాల నీలకంఠం
- స్పెషల్ బృందాలు తిరుగుతున్నా దొరకడం లేదంటున్న ఎక్సైజ్ వర్గాలు
- టీడీపీ గ్రూపు రాజకీయాలతో దొరికిన నకిలీ మద్యం
- సూత్రధారిని జిల్లా కీలక నేత సోదరుడు తప్పిస్తున్నట్టుగా అనుమానాలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

నకిలీ మద్యం కేసు మిగతా కేసుల్లాగానే నీరు గారిపోతున్నట్లు కనిపిస్తోంది. కీలక సూత్రధారి మీసాల నీలకంఠం తప్పించుకుని తిరుగుతున్నారు. మరోవైపు ఆయన వేసిన క్వాష్ పిటీషన్ కోర్టు కొట్టేసింది. ప్రత్యేక బృందాన్ని వేశామని చెబుతున్న ఎక్సైజ్ అధికారులు ఆయనను పట్టుకోలేకపోతున్నారు.

ఈ నెల 2వ తేదీన సారవకోట మండం అవలింగి సమీపంలోని దుర్గా వైన్ షాపులో, సమీపంలోని ఇంటిలో నకిలీ మద్యం దొరికింది. షాపులో విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన నకిలీ మద్యం బాటిళ్లు దొరకగా, సమీపంలోని ఇంట్లో నకిలీ మద్యం బాటిళ్లతో పాటు ఖాళీ సీసాలు, నకిలీ మూతలు, బ్యాచ్ నెంబర్ స్టాంపింగ్ మిషన్ వంటివి దొరికాయి. ఆ ఇంటిని జిల్లా టీడీపీ కీలక నేత సోదరుడు సన్నిహితుడు మీసాల నీలకంఠం అద్దెకు తీసుకుని, నకిలీ మద్యం బాగోతాన్ని నడిపిస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన నకిలీ మద్యాన్ని ఎక్కడెక్కడికి సరఫరా చేశారో గానీ బుడితిలోని దుర్గా వైన్ షాపులో మాత్రం దొరికాయి. అద్దెకు తీసుకున్న ఇంటితో పాటు దుర్గా వైన్ షాపులో ఈ నకిలీ మద్యం వ్యవహారం చిన్నదేమీ కాదని సమాచారం. మందుబాబుల ప్రాణాలు తీసే మద్యంగా అనుమానాలు ఉన్నాయి. ఒడిశా, చత్తీస్‌గఢ్ నుంచి తీసుకొచ్చిన అల్కహాల్‌కు కలర్ కలిపి నకిలీ మద్యం తయారు చేసి, బాటిలింగ్ చేసి విక్రయిస్తున్నట్టుగా సందేహాలు ఉన్నాయి. దానికోసమే ఏకంగా ఇళ్లు అద్దెకు తీసుకున్నట్టుగా ఆరోపణలు ఉన్నాయి.

రిపోర్టు ఊహించిందే..

అవలింగిలో దొరికిన నకిలీ మద్యంలో ప్రమాదకర అల్కహాల్ కేరామెల్ కలిపి ఉండొచ్చని, ఒడిశా, చత్తీస్‌గఢ్ నుంచి తీసుకొచ్చి ఉండొచ్చని అధికార వర్గాలు సైతం భావించాయి. కానీ, నకిలీ మద్యం శాంపిల్‌ను విశాఖలోని ల్యాబ్‌కు పంపించగా డైల్యూట్‌లో ఫ్రెష్ లిక్కర్ విత్ వాటర్ అని రిపోర్టు వచ్చిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు తెలిపారు. అంటే తక్కువ ధర వైన్‌లో నీటిని కలిపి ఎక్కువ ధర వైన్‌లో మిక్స్ చేసినట్టుగా రిపోర్టులో పేర్కొన్నారు. అంటే రూ.160 ధర గల వైన్‌లో రూ.99 వైన్‌తో పాటు నీటిని కలిపినట్టు అధికారులు అంచనాకు వచ్చారు. సాధారణంగా ఎక్సైజ్ శాఖలో ఎక్కడే కల్తీ మద్యం దొరికినా, నకిలీ మద్యం పట్టుబడినా ఈ రకమైన రిపోర్టే వస్తుంది. ఇక్కడ కూడా అదే వచ్చింది. దీంట్లో నిజమెంతో వారికే తెలియాలి. ప్రమాదకరమైన అల్కహాల్ కలిసినట్టుగా ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదని ఎక్సైజ్ వర్గాలు తేల్చిపారేశాయి.

తప్పించుకుంటున్నారా? తప్పిస్తున్నారా?



కీలక సూత్రధారి మీసాల నీలకంఠం దొరకకుండా వ్యూహాత్మకంగా తప్పించుకుంటున్నారా? తెరవెనక శక్తులు తప్పిస్తున్నాయా? అన్న అనుమానాలు ఉన్నాయి. వాస్తవంగా నీలకంఠం బాగోతం అంత సులువుగా బయటపడేది కాదు. కానీ, నరసన్నపేట టీడీపీలో రెండు గ్రూపులు ఉన్నాయి. ఒక గ్రూపునకు జిల్లా కీలక నేత సోదరుడు నాయకత్వం వహించగా, మరో గ్రూపునకు స్థానిక నేత నాయకత్వం వహిస్తున్నారు. కీలక నేత సోదరుడు అండ చూసుకుని నీలకంఠం స్థానిక నేతకు కొరకరాని కొయ్యగా తయారయ్యారు. స్థానిక నేతకు నీలకంఠం నుంచి ఆర్థిక ప్రయోజనాలు అందడం లేదు సరికదా తన సిండికేట్ వ్యాపారానికి కలిసి రావడం లేదు. ఆ క్రమంలోనే స్థానిక నేత వ్యూహాత్మకంగా నీలకంఠం బాగోతాన్ని బయటపెట్టించేలా పథకం రచించారన్న వాదనలు ఉన్నాయి. తప్పని పరిస్థితుల్లో అధికారులు పట్టుకోక తప్పలేదని తెలుస్తోంది. టీడీపీలోని సిండికేట్ గ్రూపు రాజకీయాలతో నకిలీ మద్యం గుట్టు, నీలకంఠం బాగోతం బయటపడింది. ఇప్పుడా కీలక నేత సోదరుడు తెలివిగా నీలకంఠం తప్పించుకునేలా సహకరిస్తున్నారు. అధికారులకు దొరకకుండా.. అధికార వర్గాలు కూడా సీరియస్‌గా తీసుకోకుండా ఒత్తిడికి గురి చేసి నకిలీ మద్యం కేసును, మీసాల నీలకంఠంను కాపాడుతున్నట్టు అనుమానాలు ఉన్నాయి. నీలకంఠంకు కూడా ఎక్సైజ్ శాఖలో మంచి పట్టు, ఉన్నతాధికారులతో సంబంధాలు ఉన్నాయి. ఇవన్నీ ఇప్పుడాయనకు కలిసొస్తున్నట్టుగా ఆరోపణలు ఉన్నాయి.

సాధారణ కేసుగానే..

జిల్లాలో ఇప్పటికే ప్రభుత్వం మద్యంలో అడల్ట్రేషన్ జరుగుతోంది. కాస్ట్‌లీ లిక్కర్‌లో చీప్ లిక్కర్ కలపడం, చీప్ లిక్కర్‌లో నీరు కలపడం వంటి సాధారణంగా జరుగుతున్నాయి. ఆ మధ్య టెక్కలిలో ఒక కేసు వెలుగు చూసింది. తర్వాత మసిపూసి మారేడు కాయ చేసేశారు. కల్తీ మద్యం ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోని లైసెన్సు దుకాణాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న బెల్ట్ దుకాణాల్లో విక్రయిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఏదైనా తేడా కొడితే భారీగా మూల్యం చెల్లించుకోకతప్పదు.

నేటికీ దొరకని కీలక సూత్రధారి

ఈ నకిలీ మద్యం కేసులో కీలక సూత్రధారి మీసాల నీలకంఠంగా అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఎప్పుడైతే నకిలీ మద్యం పట్టుబడిందో నీలకంఠం పరారైపోయారు. మద్యం బాటిళ్లు దొరికిన దుర్గా వైన్ షాపులో పనిచేస్తున్న ఇద్దరు నౌకర్ నామాలను, లైసెన్సు షాపు యజమానిని అరెస్టు చేశారు. ఆ తర్వాత షాపు సీజ్ చేశారు. ఇక, నీలకంఠం తీసుకున్న అద్దె ఇంట్లో ఉంటున్న పైడిరాజు ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. కీలక సూత్రధారి మీసాల నీలకంఠం మాత్రం దొరకడం లేదు. ఈయన కోసం ప్రత్యేక బృందాలను నియమించినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు నీలకంఠం కోర్టులో క్వాష్ పిటీషన్ వేశారు. దాన్ని కోర్టు కొట్టేసింది. ఇప్పుడాయన ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నారు.

సచివాలయ ఉద్యోగులతో పోలీసుల వాగ్వాదం



● ప్లానింగ్ ప్రకారం కక్ష సాధింపు

- ప్లానింగ్ సెక్రటరీలపై ఏసీపీ కక్ష సాధింపు
- ప్రశ్నించే వారిని వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్న వైనం
- ఎఫ్ఏసీ అలవెన్సులు ఇవ్వకుండా ఇష్టానుసారం విధుల అప్పగింత
- ఆందోళనకు దిగిన ఉద్యోగులు
- శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం 10 నుంచి 3గంటల వరకు ఉద్రిక్తత



మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సచివాలయ ఉద్యోగులపై ఓ 'ప్లానింగ్' ప్రకారమే కక్ష సాధింపులు జరుగుతున్నట్టు ఉన్నాయి. ఇతర ఏ శాఖలోని ఉద్యోగులకూ ఇవ్వనన్ని బాధ్యతలు వీరికే అప్పగిస్తున్నారు. పనులు చేయకపోతే తిట్ల దండకం ఎత్తుకుంటున్నారు. ప్రత్యేకించి శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ సచివాలయ ఉద్యోగుల్ని పురుగుని చూసినట్లు చూస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. 'సిగ్గు, లజ్జ లేదా.. పది వేళ్లు నోటికి ఎలా వెళ్తున్నాయి..' అని రాయలేని భాషలో తిడుతున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏసీపీ–2 జానకి ప్లానింగ్ సెక్రటరీలను నిరంతరం వేధింపులకు గురిచేస్తున్నారు. సమయంతో సంబంధం లేకుండా పనులు అప్పగిస్తున్నారని, ప్రశ్నిస్తే కక్షసాధింపులకు పాల్పడుతున్నారని చెబుతున్నారు.

జీతాలు పెట్టకపోవడం దారుణం



దసరా వంటి పండుగ పూట జీతం ఇవ్వకుండా ఇలా ఇబ్బంది పెట్టడం న్యాయమా. ఒకే సమయంలో చాలా పనులు చెబుతున్నారు. మాకు కూడా కుటుంబాలు ఉంటాయి కదా. సంబంధం లేని పనులన్నీ చెబుతున్నారు.

– రెల్ల యమున, వార్డు ప్లానింగ్ సెక్రటరీ

దసరా పూట పస్తులే..

టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్లానింగ్ సెక్రటరీలకు జీతాలు పెట్టవద్దంటూ ఏసీపీ లేఖ రాయడం అందరినీ విస్మయపరుస్తోంది. దసరా వంటి పండుగ వేళ జీతాలు రాకుండా అడ్డుకోవడం ఎంతవరకు న్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 నుంచి 3గంటల వరకు వారు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సుమారు రెండు గంటల పాటు పోలీసులు, సచివాలయ ఉద్యోగులు, ఏసీపీ, ఉన్నతాధికారులు చర్చించి చివరకు జీతాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను తాత్కాలికంగా విరమించారు.

వేధింపులు ఇలా..

- సచివాలయ ఉద్యోగుల చేత కనీసం 14 నుంచి 15 గంటల పాటు పనిచేయిస్తున్నారు.
- ప్రభుత్వ సెలవు రోజుల్లో సైతం పనులు అప్పగిస్తున్నారు.
- అదనపు అలవెన్సుల ఊసే లేదు. ఇన్‌చార్జిల పేరుతో ఒక్కొక్కరికి 4 నుంచి 5 సచివాలయాలు అప్పగిస్తున్నారు.

శక్తికి మించి పనులు



ఒక్కో ఉద్యోగికి నాలుగైదు సచివాలయాలు అప్పగిస్తున్నారు. వలంటీర్లు చేసిన పనులు మా చేత చేయిస్తున్నారు. శక్తికి మించి పనులు అప్పగించి ఉద్యోగం మానేసేలా టార్చర్ చేస్తున్నారు.

– వంగ వెంకటరమణ, వార్డు ప్లానింగ్ సెక్రటరీ

ఓపిక నశించి



చాపర పీహెచ్‌సీలో వైద్యం కోసం వేచి ఉన్న ఓపీ రోగులు

- నిరసనకు దిగిన పీహెచ్‌సీ వైద్యులు
- ఓపీ సేవలకు దూరం
- నేటి నుంచి పూర్తిస్థాయి వైద్యసేవలు బంద్

అరసవల్లి: ప్రభుత్వ వైఖరితో సర్కారు వైద్యుల్లో ఓపిక నశించిపోయింది. దీంతో వైద్యులంతా నిరసన బాట పట్టారు. ముందస్తు నోటీసు ప్రకారం సోమవారం నుంచి ఓపీ సేవలను ఎక్కడికక్కడే నిలిపివేశారు. గత రెండు రోజుల నుంచి అధికారిక వాట్సాప్ గ్రూప్‌ల నుంచి నిష్క్రమించిన వైద్యులు ఆన్‌లైన్ నివేదికలను పంపించడాన్ని కూడా నిలిపివేశారు. తాజాగా ఓపీ సేవలను అన్ని పీహెచ్‌సీలలో నిలిపివేయడంతో రోగులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. అయితే ఎమర్జెన్సీ సేవలను మాత్రం అనుమతిస్తూ తమ వృత్తిధర్మాన్ని పాటించారు.

ఓపీ సేవలకు దూరంగా

జిల్లాలో 72 గ్రామీణ పీహెచ్‌సీల్లో సుమారు 125 మంది వైద్యులు సమ్మె బాట పట్టారు. ఇందులో భాగంగా ఔట్‌పేషెంట్(ఓపీ) సేవలకు అనుమతి నిరాకరించడంతో ఎక్కడికక్కడ రోగులు ప్రభుత్వ వైద్యం కోసం పడిగాపులు కాశారు. ఒక్కో పీహెచ్‌సీకి 30 నుంచి 35 మంది రోగులు చొప్పున మొత్తం 2, 500 మంది సోమవారం ప్రభుత్వ వైద్యానికి దూరమయ్యారు. వర్షాలు, వాతావరణ పరిస్థితుల కారణంగా జ్వరాలు, ఇతరత్రా సీజనల్ వ్యాధులతో రోగులు అవస్థలు పడ్డారు. అలాగే చిన్నారులకు, బాలింతలకు వ్యాక్సినేషన్ ప్రక్రియ కూడా నిలిచింది.

నేటి నుంచి పూర్తిస్థాయి బంద్



రాష్ట్ర, గ్రామీణ పీహెచ్‌సీ వైద్య సంఘ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం సఫలీకృత చర్చలకు అవకాశం ఇవ్వకపోవడంతో వైద్యు లు సమ్మె నోటీసును జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు షెడ్యూల్ ప్రకారం ఎమర్జెన్సీ సర్వీసులు మాత్రమే అందిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు మంగళవారం నుంచి పూర్తిస్థాయి వైద్య సేవలను నిలిపివేస్తున్నారు. మంగళ, బుధవారాల్లో జిల్లా కేంద్రంలో పీహెచ్‌సీ వైద్యులంతా ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘ ప్రతినిధులు డాక్టర్ సుధీర్(గుప్పెడుపేట), ప్రతిష్టాశర్మ(బాతువ), సుమప్రియ(పోలాకి), పావని(చాపర) బృందం ఆధ్వర్యంలో కార్యాచరణ అమలు చేస్తున్నారు. మెళియాపుట్టి మండలం చాపర పీహెచ్‌సీలో వైద్యురాలు పావని అత్యవసర వైద్యం కింద ఓ గర్భిణికి డెలివరీ చేసి తమ వైద్య వృత్తి ధర్మాన్ని చాటుకోవడం గమనార్హం.





శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని సోమవారం సరస్వతీ దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అక్షరాభ్యాసాలు జరిగాయి. జిల్లా కేంద్రంలోని మొండేటివీధిలో అమ్మవారిని ఇలా అలంకరించారు. జ్ఞాన సరస్వతీ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి.

● కొండెక్కిన నాటుకోడి



దసరా దగ్గర పడుతున్న కొద్దీ నాటుకోడి ధర కొండెక్కి కూర్చుంటోంది. కిలో బరువు తూగే కోడిపుంజు రూ.800 పైమాటే పలుకుతుండగా కోడిపెట్ట ధర రూ.700 పలుకుతోంది. అయినా కొనుగోలుకే జనం మొగ్గు చూపుతుండటంతో అవి ఇట్టే అమ్ముడవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సైతం నాటుకోడి ధరలు విపరీతంగా పెరిగాయి. –హిరమండలం

క్లుప్తంగా

మలేషియాలో ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు



చెక్క భజన నేర్చుకుంటున్న ఉత్తరాంధ్రులు

పలాస: మలేషియాలో నివసిస్తున్న తెలుగు ప్రజలకు చెక్కభజన, కోలాటం, తదితర జానపద కళారూపాల్లో శిక్షణ ఇచ్చే అవకాశం ఉత్తరాంధ్ర జానపద కళాకారులకు దక్కడం గొప్ప విషయమని పలాస మండలం రంగోయి గిడుగురామ్మూర్తి తెలుగు భాషా జానపద కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు చెప్పారు. కళాపీఠం సభ్యులు తవిటినాయుడు, సాయికుమార్‌లు మలేషియాలో నెల రోజుల పాటు అక్కడి తెలుగువారికి జానపద కళల్లో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.

స్తంభాన్ని ఢీకొట్టి యువకుడు మృతి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల సమీప వాటర్‌ట్యాంక్ వద్ద విద్యుత్తు స్తంభాన్ని ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ యువకుడు ఢీకొట్టాడు. ఈ నెల 27న జరిగిన ఈ ప్రమాదంలో విశాఖపట్నం హనుమంతువాకకు చెందిన కొత్తలంక పూర్ణచంద్రరావు తీవ్రంగా గాయపడి ఆదివారం రాత్రి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ట్రాఫిక్ పోలీసులు సోమవారం వెల్లడించారు.

వివాహమై మూడు నెలలే..

శ్రీకాకుళం రిమ్స్ ప్రభుత్వాసుపత్రిలో పరిపాలనావిభాగంలో కార్యాలయ అసిస్టెంట్‌గా ఉన్న పూర్ణచంద్రరావుకు విశాఖ యువతి పావనితో మూడు నెలల కిందట వివాహమైంది. పూర్ణచంద్రరావు కారుణ్య నియామకంలో రిమ్స్‌లో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. శనివారం రిమ్స్‌లో గాయాలతో పూర్ణచంద్రరావు చేరినా అక్కడి సిబ్బంది ఎందుకో గోప్యంగా ఉంచారని భార్య పావని చెప్పినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ వెల్లడించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



మృతి చెందిన హరిచంద్ర

కొత్తూరు: సిరుసువాడ గ్రామానికి చెందిన కోటిలింగాల హరిచంద్ర (55) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. సోమవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో గంట పాటు భారీ వర్షం కురిసింది. ఇంటి పెరటిలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. అదే సమయములో ఇంట్లో కుటుంబ సభ్యులతో ఉన్న హరిచంద్ర పిడుగు ధాటికి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కొత్తూరు సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందాడు. హరిచంద్రకు భార్య అనసూయ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పేద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని యువజన నాయకులు పెద్దిన అమర్‌నాథ్, గ్రామస్తులు కోరారు.

తాటి వనాలతో సంరక్షణ



బట్టిగళ్లూరు తీరప్రాంతంలో అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న శాంతి ప్రియ పాండే

సోంపేట: తీర ప్రాంతం వెంబడి తాటి వనాలను పెంచడం ద్వారా ప్రకృతి విపత్తులు, తుఫానులు, సునామీల నుంచి రక్షణ లభిస్తుందని అటవీశాఖ చీఫ్ వైల్డ్ ఆఫ్ వార్డెన్ , అడిషనల్ పీసీసీఎఫ్ శాంతి ప్రియ పాండే అన్నారు. బట్టిగళ్లూరు గ్రామంలోని తీర ప్రాంతాన్ని అటవీ శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. అటవీ శాఖ ద్వారా తాటి విత్తనాలు సేకరించి తీరప్రాంతం వెంబడి నాటే కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. సముద్ర తాబేళ్ల సంరక్షణపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డీఎఫ్ఓ ప్రసన్న, కాశీబుగ్గ రేంజర్ మురళీ కృష్ణం నాయుడు, సెక్షన్ ఆఫీసర్ బిందుమతి, బీట్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సోమేశ్వరరావు, మత్స్యకార ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

69 తులాల బంగారం చోరీ

- కె.మత్స్యలేశంలో మూడు ఇళ్లల్లో దొంగతనం
- నగలుతో పాటు రూ.లక్ష నగదు పట్టుకెళ్లిన చోరులు
- రంగంలోకి దిగిన క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ పోలీసులు



కె.మత్స్యలేశంలోని చోరీ జరిగిన ఇళ్లు

గార : తీరప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కళింగపట్నం-మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం)లో భారీ చోరీ జరిగిందన్న సమాచారం మత్స్యకార గ్రామాల్లో కలకలం రేపింది. తాళం వేసి ఉన్న మూడు ఇళ్లల్లో ఆదివారం రాత్రి దొంగలు చొరబడి తాళాలు పగలగొట్టి భారీగా బంగారం, సొమ్ము ఎత్తుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం .. చిన్న మత్స్యలేశంలోని మైలపిల్లి శంకర్ భగవాన్ దాస్‌కు చెందిన కాంపౌండ్‌లో మూడు ఇళ్లల్లో ఒక దాంట్లో తన సోదరి పుక్కల్ల పద్మావతి, మరొక ఇంట్లో అమ్మ, మూడో ఇంట్లో మేనల్లుడు పప్పు దీపక్ నివాసముంటున్నారు. పద్మావతి ఇంటి నిర్మాణం జరుగుతుండటంతో అన్నయ్య ఇంట్లో ఉంటున్నారు. పెద్ద అక్క కుమారుడు దీపక్ మర్చంట్ నేవీలో డ్యూటీ చేసేందుకు సోమవారం విమానం ఎక్కాల్సి ఉండగా, ఆదివారం సాయంత్రం విశాఖలోని అత్త వారింటికి ఆదివారం ఉదయమే వెళ్లిపోయాడు. శంకర్ భగవాన్‌దాస్ శ్రీకాకుళంలో నివాసముండేందుకు వెళ్లడంతో ఇలు ఖాళీగా ఉంచడం ఇష్టం లేక తల్లి ఉంటోంది. రెండు రోజుల క్రితం తల్లికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో శ్రీకాకుళంలోని సొంతింటికి తీసుకెళ్లాడు. పద్మావతి అదే గ్రామంలోని తన అక్క ఇంటికి భోజనానికి వెళ్లి అక్కడే నిద్రపోయింది. ఇదంతా పసిగట్టిన దొంగలు ఆదివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. పద్మావతికి చెందిన 50 తులాల బంగారు నగలు, ఇంటి నిర్మాణం కోసం ఉంచిన రూ.లక్ష నగదు తీసుకెళ్లిపోయారు. శంకర్‌భగవాన్‌దాస్‌కు చెందిన బీరువా నుంచి 15 తులాల బంగారు నగలు, మేనల్లుడు దీపక్‌కు సంబంధించిన నాలుగు తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. పద్మావతి సోమవారం ఉదయం ఇళ్ల పరిస్థితిని చూసి సోదరుడు శంకర్‌కు తెలియజేయగా.. ఆయన గార పోలీసులకు సమాచారమిచ్చారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ బృందం రంగంలోకి దిగి వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. సీఐ కె.పైడపునాయుడు, ఎస్ఐ సీహెచ్.గంగరాజు పరిశీలించారు.



పద్మావతి ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

సీసీ కెమెరాల్లో నిక్షిప్తం..

చోరీ జరిగిన వీధిలోని వైద్యుడి ఇల్లు, మరో ఇంటి వద్ద ఉన్ సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఆదివారం రాత్రి 10.45 గంటల సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడటం, తిరిగి 12.05 గంటల ప్రాంతంలో గోడ పైనుంచి దూకి బైక్‌పై వెళ్లిపోతున్నట్లు సీసీ కెమెరాలో రికార్డు అయ్యినట్టు పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. వీటి ఆధారంగా దొంగతనానికి పాల్పడిన ఇద్దరు స్థానికులా, వేరే ప్రాంతాలకు చెందిన దొంగలా అన్న కోణంలో పోలీసులు విచారణ వేగవంతం చేశారు.



సీసీ కెమెరాకు చిక్కిన దుండగులు

గంజాయి స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్. చిత్రంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, వర్కర్లు, డ్రైవర్లను లక్ష్యంగా చేసుకుని గంజాయి సరఫరా జరుగుతున్న నేపథ్యంలో గట్టి నిఘా అవసరమని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డితో కలిసి నార్కోటిక్ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని కళాశాలల్లో తక్షణమే ఈగల్ కమిటీలు ఏర్పాటు చేసి డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. డ్రగ్స్ రహిత సమాజంపై సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరగాలని సూచించారు. ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి అరికట్టడంలో కేసులు పెట్టడం మాత్రమే లక్ష్యం కాదని, ఒకే వ్యక్తి పదేపదే వాడుతున్నాడంటే నిఘా లోపం ఉన్నట్లేనని పేర్కొన్నారు. చిన్న సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు గానీ, 112 లేదా 1930 నంబర్లకు గానీ తెలియజేయాలని కోరారు. 2025 జులై-ఆగస్టు నెలల్లో 350.4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని 77 మందిని అరెస్ట్ చేసి, 8 వాహనాలను సీజ్ చేసినట్టు వివరించారు.

మహిళా భద్రతకు అమలు చేస్తున్న 'నారీ శక్తి' కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందన్నారు. అనంతరం రహదారుల భద్రతపై సమీక్షించారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 524 రహదారి ప్రమాదాలు నమోదయ్యాయని ఎస్పీ వెల్లడించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, పోలీస్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, విద్యా, వైద్య ఆరోగ్య శాఖ, ఇంజనీరింగ్, రవాణా శాఖల అధికారులు హాజరయ్యారు.

25 కేజీల గంజాయితో ఇద్దరు అరెస్టు

పలాస : పలాస రైల్వేస్టేషన్ మార్గంలో 25 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ సోమవారం విలేకరులకు వెల్లడించారు. ఒడిశాలో కొనుగోలు చేసిన 10 కిలోల గంజాయిని పలాస రైల్వేస్టేషన్ మీదుగా కోల్‌కతాకు రవాణా చేసేందుకు వెళ్తుండగా పర్లాకిమిడికి చెందిన సర్వశుద్ధి కుమార్ స్వామిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో.. గజపతి జిల్లా జలంతర్సింగ్ గ్రామానికి చెందిన రాజేష్‌బెరా ఒడిశాలో కొనుగోలు చేసిన 15 కిలోల గంజాయిని తెలంగాణకు రైలు ద్వారా అక్రమ రవాణా చేసేందుకు పలాస రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా అరెస్టు చేశారు. గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.



పట్టుబడిన నిందితులతో పోలీసులు

పదోన్నతులు కలేనా?



కోర్టు తీర్పు అమలు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం తక్షణం హైకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి పండితులకు పదోన్నతులు కల్పించాలి. నెలలు గడుస్తున్నా తాత్సారం చేయడం సరికాదు. ప్రత్యేక బదిలీలతో వీరిని వేధిస్తున్నారు.

– పిసిని వసంతరావు, అధ్యక్షుడు, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ

వేదనకు గురవుతున్నాం



పండితులకు పదోన్నతులు ఇవ్వకపోగా ఏటా మారుమూల ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారు. దీని వల్ల మానసిక ఆందోళనకు గురవుతున్నాం. హైకోర్టు ఇచ్చిన తీర్పును సైతం అమలు చేయకపోవడం సరైన పద్ధతి కాదు.

– లోలుగు ప్రసాద్, డీఈఓ పూల్ పండితుడు

- ప్రమోషన్లకు నోచుకోని డీఈవో పూల్ పండితులు
- పదేళ్లుగా తప్పని నిరీక్షణ
- ఏటా మారుమూల ప్రాంతాలకు బదిలీ
- అమలు కాని కోర్టు ఉత్తర్వులు

శ్రీకాకుళం: డీఈఓ పూల్‌లోని పండితులు పదోన్నతులకు నోచుకోవడం లేదు. అనేక ఏళ్లుగా అప్‌గ్రేడేషన్ కోసం పోరాటం చేస్తున్న వీరికి 2019లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్దతుగా నిలిచారు. వీరి గోడును తెలుసుకొని అప్‌గ్రేడేషన్ కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా పండితులుగా పనిచేస్తున్న 1200 మంది పండితులు స్కూల్ అసిస్టెంట్ భాషోపాధ్యాయులుగా పదోన్నతి పొందారు. అయితే రాష్ట్రంలో 1134 మంది పండితులు పోస్టులు ఖాళీగా లేకపోవడంతో డీఈవో పూల్‌లోనే నేటికీ కొనసాగుతూ వస్తున్నారు. అందులో శ్రీకాకుళం జిల్లాలో 87 మంది పండితులు ఇప్పటికీ పదోన్నతులకు నోచుకోకుండా డీఈవో పూల్‌లోనే ఉండిపోయారు. వీరిలో 65 తెలుగు పండిట్లు, 18 ఒరియా పండిట్లు, 4 హిందీ పండిట్లు ఉన్నారు. ఈ కారణంగా ఏటా ఉపాధ్యాయులకు బదిలీలు చేసినప్పుడు వీరి ప్రమేయం లేకుండానే మారుమూల ప్రాంతాలకు బదిలీ అవుతున్నారు. దీంతో వారంతా మానసిక ఆందోళనకు గురవుతున్నారు. డీఈవో పూల్లో ఉన్న వారికి స్కూల్ అసిస్టెంట్ స్థాయి జీతాలు చెల్లించడం లేదు. పండిట్లకు ఇచ్చే జీతాన్నే ఇస్తున్నారు.

కోర్టు చెప్పినా..

రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఉత్తర్వులను సైతం బేఖాతరు చేస్తోంది. పండితులకు పదోన్నతులు కల్పించకపోగా, ఏటా వారి ప్రమేయం లేకుండానే బదిలీల చేస్తుండటంపై విసిగి వేశారిన పండితులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై క్షుణ్ణంగా పరిశీలించిన ధర్మాసనం తక్షణం పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమాన పనికి తగిన వేతనం ఇవ్వాలని 2024 డిసెంబర్‌లో తీర్పును వెలువరించింది. ఇది జరిగి తొమ్మిది నెలలు కావస్తున్నా ప్రభుత్వంలో స్పందన కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఎస్జీటీలు సైతం కోర్టును ఆశ్రయించగా యథాస్థితి కొనసాగించాలని ఆదేశించింది. మరలా దీనిపై పండితులు కోర్టును ఆశ్రయించగా, హైకోర్టు తాజాగా స్టేటస్ కోను ఎత్తివేసింది. అయినా ప్రభుత్వం పదోన్నతులకు చర్యలు తీసుకోకపోవడం పట్ల పండితులు తీవ్ర మానసిక వేదనకు గురవుతూ ఉద్యమానికి సిద్ధపడుతున్నారు. ఇతర ఉపాధ్యాయ సంఘాలు సైతం వీరికి అండగా నిలవాలని యోచిస్తున్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- 93 ఫిర్యాదుల స్వీకరణ



కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేస్తున్న సుర్జిని గ్రామస్తులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి 93 అర్జీలు స్వీకరించారు. అనంతరం బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకొని డీఎస్సీకి ఎంపికైన 12 మందిని అభినందించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ బ్యానర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని ప్రశాంతంగా బతకనీయండి..

మెళియాపుట్టి: సుర్జిని గ్రామ పరిధిలో గ్రానైట్ క్వారీ వల్ల సమస్యలు మొదలవుతాయని, తమను ప్రశాంతంగా బతకనివ్వాలని మెళియాపుట్టి మండలం బాణాపురం సర్పంచ్ పెద్దింటి చంద్రరావు, విశ్రాంత ఉపాధ్యాయులు కొర్ల కృష్ణమూర్తి తదితరులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో వినతి పత్రం అందజేశారు. క్వారీ యాజమాన్యం ఇష్టారాజ్యంగా బయట గ్రామాల ప్రజలను తీసుకొచ్చి అభిప్రాయ సేకరణ ముగించారని, సుర్జిని గ్రామంలో ఎవరికీ సమాచారం ఇవ్వలేదన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 44 వినతులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ – పరిష్కార వేదిక (గ్రీవెన్సు)లో 44 వినతులు అందాయి. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, అదనపు ఎస్పీ కె.వి.రమణలు ఫిర్యాదులు స్వీకరించారు. సత్వర న్యాయం చేస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

హార్డ్‌వేర్ షాపు దగ్ధం



కొత్తూరులో కాలిపోతున్న కమల హార్డ్‌వేర్ షాపు

- కొత్తూరులో వేకువజామున ఘటన
- సుమారు కోటి రూపాయల ఆస్తి నష్టం
- మూడు ఫైర్ ఇంజిన్లతో మంటలు అదుపు చేసిన సిబ్బంది



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొత్తూరు : కొత్తూరులోని బత్తిలి రోడ్డులో ఇరాజీ కిమారామ్‌కు చెందిన కమల హార్డ్‌వేర్ షాపులో ఆదివారం వేకువజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు కోటి రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని సమాచారం. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీపంలోని కొత్తూరు అగ్ని ప్రమాక కేంద్రానికి సమాచారం అందించారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ శంకరరావు సిబ్బందితో వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే ఇంజిన్ మోటార్ పనిచేయకపోవడంతో మంటలు అదుపులోకి రాలేదు. విషయాన్ని జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహన్‌రావుకు తెలియజేయడంతో వెంటనే పాలకొండ, ఆమదాలవలస అగ్నిమాపక కేంద్రాల ఫైర్ ఇంజిన్లు వచ్చాయి. సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. హార్డ్‌వేర్‌షాపుతో పాటు పక్కనే ఆనుకుని ఉన్న చంద్రశేఖర్ మందులు షాపులోకి మంటలు చెలరేగడంతో అక్కడ కూడా సుమారు రూ.ఏడు లక్షల విలువైన మందులు పాడయ్యాయి. జిల్లా అగ్నిమాపక అధికారి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు.

పేరు పెట్టి పిలిచినందుకు కత్తితో దాడి

- నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష

శ్రీకాకుళం క్రైమ్ : ఎచ్చెర్ల మండలం ఎస్ఎంపురం గ్రామానికి చెందిన కామరాసి అసిరయ్యకు జిల్లా న్యాయస్థానం రెండేళ్ల సాధారణ జైలుశిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించింది. పేరు పెట్టి పిలిచాడనే కారణంతో అసిరయ్య అదే గ్రామానికి చెందిన లింగాల రామారావుపై కత్తితో దాడి చేసి రోడ్డుపై ఈడ్చుకెళ్లడంతో ఈ శిక్ష పడింది. వివరాల్లోకి వెళ్తే.. రామారావు కొబ్బరికాయలు తీసే కూలీ. గతేడాది జనవరి 12న కొబ్బరికాయలు దింపడానికి వెళ్లి తిరిగి మధ్యాహ్నం భోజనానికని ఇంటికి వస్తుండగా వెలమవీధిలో అసిరయ్య ఎదురుపడ్డాడు. ఈ క్రమంలో 'ఏమిరా అసిరయ్యా' అని రామారావు పలకరించడంతో నన్నే పేరు పెట్టి పిలుస్తావా అంటూ అసిరయ్య రామారావు వద్ద ఉన్న కత్తి తీసుకుని తల వెనుక భాగాన గాయపర్చాడు. ఎచ్చెర్ల ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేయగా అప్పటి శ్రీకాకుళం డీఎస్పీ శృతి కేసు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీటు దాఖలుపర్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కింజరాపు అచ్చెన్నాయుడు కేసును వాదించగా సోమవారం నేరారోపణ రుజువు కావడంతో నాలుగో అదనపు జిల్లా కోర్టు, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఎస్.ఎం.ఫణికుమార్ జైలు శిక్ష విధించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై నిరసన నేడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ విభాగం అధ్యక్షుడు టి.జె.ఆర్.సుధాకర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సూచనల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం అంబేడ్కర్ కూడలి వద్ద జరిగే ఈ నిరసన కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల అనుబంధ విభాగాల అధ్యక్షులు, దళిత సామాజికవర్గ పార్టీ నాయకులు, జిల్లా నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల కార్యవర్గ నాయకులు, వార్డు సభ్యులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

శ్రీకాకుళం: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలని ప్రభుత్వం యోచించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం శ్రీకాకుళంలో దళిత, ఆదివాసీ, బహుజన, మైనారిటీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వైద్య విద్యకు పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను దూరం చేస్తోందని, ఈ కుట్రను తిప్పికొట్టేందుకు మేధావుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.టౌన్ హాల్ సమీపంలోని శ్రీ ఫంక్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశంలో కులమతాలు, రాజకీయ పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

దుర్గంధం..భరించలేం..



వ్యర్థాలతో నిండిన కొత్తరోడ్డు ఫుట్‌పాత్

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కొత్తరోడ్డు నుంచి జాతీయ రహదారి మీదుగా వెళ్లే మార్గం దుర్గంధభరితంగా మారింది. ఇక్కడి ఫుట్‌పాత్‌పై చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పరిసర ప్రాంతాల్లో ఎక్కడ శుభకార్యాలు, ఫంక్షన్లు జరిగినా మిగిలిపోయిన భోజనాలు, ఇతర వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడే పారబోస్తున్నారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు అవి కుళ్లిపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.